క్లుప్తంగా

పథకాలను సద్వినియోగం చేసుకోండి


హెల్త్ కార్డును పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

కల్లూరు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. ఆదివారం బస్తిపాడు, బొల్లవరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్ యోజన గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలకు ఆయుష్మాన్ భారత్ యోజన హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగేశ్వర రావు, మెడికల్ ఆఫీసర్ మోతీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరంలో భక్తుల సందడి


భోగేశ్వరాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

గడివేముల: కార్తీకమాసం, ఆదివారం కావడంతో భోగేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి వరకు కొనసాగింది. భక్తులు ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్ల స్నానాలు ఆచరించి భోగేశ్వరస్వామిని, దుర్గా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణాల్లో కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాటు చేశారు.

మహిళపై దాడి

పాణ్యం: స్థానిక బనగానపల్లె రోడ్డులో ఓ మహిళపై వ్యక్తి దాడి చేయడంతో ఆమెకు గాయాలైనట్లు 108సిబ్బంది తిరుపాల్, చెన్నయ్య ఆదివారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గుగ్గారెడ్డి పల్లెకు చెందిన రమ్య బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చింది. రోడ్లపై పడేసిన ప్లాస్టిక్ వస్తువులను సేకరించి విక్రయించుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఆమెతో స్నేహంగా ఉన్న మరో వ్యక్తి మద్యం మత్తులో ఆమె దాడి చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనానికి సమాచారం చేరడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఫిజియోథెరపీతో ప్రయోజనం

సి.బెళగల్: దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో కోరారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు సంబంధించి శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ చేస్తారన్నారు. దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచించారు.

కిసాన్ సభను విజయవంతం చేయండి

సి.బెళగల్: కర్నూల్లో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత కిసాన్ సభ విజయవంతం చేయాలని సీబీటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రం సి.బెళగల్‌లో ఏపి కేఎస్ సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాను కరువు నుంచి విముక్తి కల్పించేందుకు, పెండింగ్ ప్రాజెక్ట్ తదితర సమస్యలపై కిసాన్ సభలో వర్చించడం జరుగుతుందన్నారు.

అలరించిన 'రావణ' పద్య నాటక ప్రదర్శన


నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం కళాకారులు ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'రావణ' పద్య నాటకం అలరించింది. తడకమళ్ల రామచంద్రరావు దర్శకత్వంలో నాటకం ప్రదర్శించ బడింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఐకాన్ అవార్డు గ్రహీత ఆదర్శ అనంతయ్య నాయుడు కళాకారులకు రూ.60 వేలు ఆర్థిక సాయం చేసి ప్రసంగించారు. త్వరలో కర్నూలులో సినిమా, సీరియల్స్ షూటింగ్ చేసుకోవడానికి అనంత ఫిల్మ్ నగర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు మహమ్మద్ మియ్యా, సీవీ రెడ్డి, రాజారత్నం, క్రిష్టఫర్, లక్ష్మీకాంతరావు, పాండు రంగయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

- అర్హత ఉంటే ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఎస్. కొట్టాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- మండలంలో ముగిసిన కార్యక్రమం


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం : రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్.కొట్టాల గ్రామంలో గడప గడపకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలోని ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి బాటలు కనిపిస్తున్నాయన్నారు. కేవలం నాలుగు సంవత్సరాల వ్యవధిలో ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు. దీనికి తోడు సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ ఇచ్చిన ప్రతి మాటను అమలు చేస్తున్నారని చెప్పారు.

అర్హతే ప్రామాణికం..

రాష్ట్రంలోని ఏ కుటుంబమైన అర్హత ఉంటేచాలు.. ఎవరి సిఫారసు లేకుండా కేవలం వలంటరీల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే వస్తాయన్నారు. నేడు దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి ఎలాంటి అవినీతి లేకుండా ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు.

గ్రామంలో అభివృద్ధి పనులు

గోరుకల్లు పంచాయతీకి మజరా అయిన ఎస్ కొట్టాల గ్రామంలో త్వరలోనే అభివృద్ధి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలోని అదనపు సీసీ రోడ్డు, అదనపు డ్రైనేజీ కాల్వలు మంజురు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంకా గ్రామంలో ఎవరైన అర్హులు ఉంటే వారికి ఇళ్ల పట్టాలు అందజేస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అర్హులను గుర్తించాలన్నారు.

ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో ఆదివారంతో ముగిసింది. మండలంలో మొత్తం 19 పంచాయతీలు ఉండగా వాటి పరిధిలో ఉన్న మజరా గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతేడాది మే 27న ప్రారంభమైన ఈ కార్యక్రమం మొదటగా తమ్మరాజుపల్లె గ్రామం నుంచి ప్రారంభించారు. ఎస్. కొట్టాల గ్రామంతో ముగించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు సద్దల సుజిత్‌రెడ్డి, ఉసేన్‌బాషా, ఎంపీటీసీ గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, దాల్‌సా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

గోరుకల్లు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకేష్‌పై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్. కొట్టాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఆయనకు ప్రజలు పెద్దఎత్తున ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. ప్రతి చిన్న పనికి డబ్బులు అడుగుతున్నాడని, డబ్బులిచ్చినోళ్లకే బిల్డింగ్‌లు మంజురు చేస్తున్నాడని చెప్పారు. వెంటనే ఎమ్మెల్యే ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని మండల ఇంజినీర్ మహబూబ్‌బాషను ఆదేశించారు.

గొందిపర్ల గ్రామ కమిటీ నియమాకం


నూతన కమిటీ నియమాక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గం, కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ నియమించారు. ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నియమాకానికి సంబంధించిన పత్రాన్ని నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎంపికైన కె.వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ఎస్. వెంకటేశ్వర్లు, సభ్యులుగా ఇ ఆర్.రాజశేఖర్‌రెడ్డి, బీసీ మద్దిలేటి, డి.సూర్యచంద్రరెడ్డి, వి.రాజశేఖర్, కె.సుధాకర్, ఎం.డి గౌస్, బి.రాజు, ఎం.తిమ్మప్ప, ఎస్.గిర్నిశేఖర్, వి.మద్దిలేటి, కె.సోమశేఖర్, బి.శ్రీనివాసులు, కె.రాంబాబు, ఎస్.వలి, బి.గోపాల్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నిత్యం ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కారం చేసేలా పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగహన కల్పించాలని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి


రామాపురం గ్రామంలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు: జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జయన్న సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని లద్దగిరి, అల్లినగరం, రామాపురం, గోరంట్ల గ్రామాల్లోని పోలింగ్ బూతులను సందర్శించి.. బీఎల్వోలకు పలు సూచనలిచ్చారు.

రెండో రోజు 511 దరఖాస్తులు

పాణ్యం: ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రెండు రోజుల పాటు నిర్వహించిన స్పెషల్ క్యాంపైన్‌లో భాగంగా ఆదివారం 511 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ తెలిపారు. వీటిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు.

సి.బెళగల్: మండలంలోని పోలింగ్ స్టేషన్లలో ఆదివారం జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ శేషఫణి తనిఖీ చేశారు. కొత్తగా ఓటు హక్కు కోసం ఒక్క రోజే ఏకంగా 174 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ఓర్వకల్లు : గత రెండు రోజులుగా చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసినట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రెండు రోజుల్లో మొత్తం 233 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

కల్లూరు: మండలంలోని గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాల ద్వారా ఓటు నమోదుకు విశేష స్పందన వచ్చింది. ఆదివారం మండల వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు క్యాంపుల ద్వారా ఫారం 6-1610, ఫారం7-424, ఫారం8-654 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ప్రోత్సాహం


బ్యాంకు లింకేజీ మెగా చెక్కును అందిస్తున్న దృశ్యం

గూడూరు: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సాహం,సాయం అందిస్తున్నదని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నగర పంచాయితీ కార్యాలయంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు.మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్సార్సీపీ ప్రభుత్వం దివ్యాంగులను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రకాల ఆటు పోట్లను ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. అనంతరం 8 గ్రూపులకు మెప్మా కింద మంజూరైన రూ. 39,34,500 చెక్కును అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ అక్కన్న, మెప్మా టీఎంసీ సూర్యనారాయణ, సీఓ మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమావారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ప్రకటనలో సూచించారు. సమస్యల పరిష్కారానికి నిర్వహించే స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు సంగాలలో వై ఏపీ నీడ్స్ జగన్

సి.బెళగల్: మండల పరిధిలోని సంగాల గ్రామ సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జేసీఎస్ మండల కనీనర్ సీబీ తులసిరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతున్నారన్నారు. గ్రామ ప్రజలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోండి


డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న దృశ్యం

పాణ్యం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నైపుణ్య శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయరెడ్డి అన్నారు. ఆదివారం కొడంజూటూరు, కందికాయపల్లె గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశాయన్నారు. శిక్షణ ఇచ్చిన అనంతరం వారికి ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నారని చెప్పారు. అనంతరం వ్యవసాయంలో డ్రోన్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాశన చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ సద్దల సుజిత్ రెడ్డి, వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ అన్వర్‌బాషా, ఈశ్వరయ్య అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ


కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో గని కృష్ణమూర్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ కవితారాణి


ఆసుపత్రిలో జరదొడ్డి రత్నమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శిరీష

గడివేముల: గని గ్రామానికి చెందిన కత్తి కృష్ణమూర్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీరు కవితారాణి సొంత ఖర్చులతో ఆదివారం కర్నూలు వెళ్లి పింఛన్ సొమ్ము అందించింది.

కోడుమూరు: మండలంలోని లద్దగిరి గ్రామానికి చెందిన జరదొడ్డి రత్నమ్మ వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స కోసం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. సచివాలయం - 1 పరిధిలోని వలంటీర్ శిరీష ఆదివారం కర్నూలుకు వెళ్లి రత్నమ్మకు పింఛన్ అందజేసింది.

ఆత్మహత్యలను నివారించవచ్చు


డాక్టర్ జ్యోతిర్మయిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో జరిగే వ్యక్తుల ఆత్మహత్యలను నివారించవచ్చని సైకాలజిస్టు డాక్టర్ జ్యోతిర్మయి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఎప్పుడూ నవ్వుతూ ఉండే వ్యక్తులు ఉన్న ట్లుండి మౌనంగా, దిగులుగా ఉంటే అలాంటి వారి ని ఓ కంట కనిపెట్టాలన్నారు. వారి బాధలను గుర్తించి వాటిని తీర్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఆ వ్యక్తి ఇంట్లో వాడైనా, బయటి వ్యక్తి అయినా ఆత్మహత్యలను నివారించడ మొక్కటే ప్రధానమన్నారు. మన దేశంలో ప్రతి సంవత్సరం 7లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తున్నారని, ఇది చాలా బాధాకర విషయమన్నారు. అనంతరం ఆమెను ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, కల్యూకర చంద్రశేఖర్, ఎలమర్తి రమణయ్య, జేఎస్ఆర్‌కే శర్మ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): గ్రామీణ ప్రాంతాల్లో కనమరుగవుతున్న జానపద కళను పోషించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఎన్ రసూల్ కోరారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ప్రజా నాట్యమండలి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జానపద కళాకారులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. డప్పు కళాకారుల పెన్షన్‌ను కూడా రూ.6 వేలకు పెంచడం తోపాటు వృద్ధ కళాకారులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మగురుడు, వెంటకరాముడు, మాణిక్యం, హుస్సేన్, రఘు, శివ, మహేష్, కావ్య, లక్ష్మీ, ప్రకాష్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీకి 175 సీట్లు రావాలని..



కర్నూలు చేరుకున్న ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కట్టెపోగు బసవరావు పాదయాత్ర

కర్నూలు(హాస్పిటల్): వచ్చే సాధారణ ఎన్నికల్లో వైఎస్ ఆర్‌సీపీ 175కు 175 సీట్లు గెలవాలని ఆకాంక్షిస్తూ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కట్టెపోగు బసవరావు పాదయాత్ర చేపట్టారు. గత నెల 15వ తేదీన వైఎస్ ఆర్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఆయన ప్రారంభించిన పాదయాత్ర ఆదివారం కర్నూలు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాను పాదయాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. తాను చేసే పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17వ తేదీన ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు.

రోడ్ల అభివృద్ధికి రూ.60లక్షలు మంజూరు

కల్లూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేయడానికి ఉపాధి హామీ పథకం కింద రూ.60లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ అచ్యుతానందారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ నిధులతో ప్రాధాన్యతలను అనుసరించి ఎంపికచేసిన గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. ఉలిందకొండ-రూ.10 లక్షలు, బస్తిపాడు-రూ.5 లక్షలు, నాయకలు-రూ.5 లక్షలు, కొంగనపాడు-5 లక్షలు, చిన్నటేకూరు-5 లక్షలు, పుసులూరు-5 లక్షలు, బొల్లవరం-రూ.5 లక్షలు, రెమడూరు-రూ.5 లక్షలు, ఎ.గోకులపాడు-రూ.5 లక్షలు, పెద్దటేకూరు-రూ.5 లక్షలు, తడకనపల్లె (వామసముద్రం) -రూ.5 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లోని కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

నాలుగు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (టౌన్): నగరంలోని దేవనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఉన్న 250 ఎంఎం డయా పైపులైన్ లీకేజీకి గురికావడంతో నాలుగురోజుల పాటు (ఈనెల 6 వ తేది వరకు) నీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవనగర్, పాలకొట్టాలు, ఠాకూర్ నగర్, బిర్లాగడ్డ, గాయత్రీ ఎస్టేట్, లక్ష్మీనగర్, మద్దూరునగర్, జేఎస్ ఆర్ కల్లూరు ప్రాంతంలోని విశల్ నగర్, రాజీవ్ నగర్, సవరమ్మ గుడి, ఆర్‌సీఎం కాంప్లెక్స్ ప్రాంతాల ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

భగవద్గీత పఠన పోటీల విజేతలు వీరే


బహుమతులు ప్రదానం చేస్తున్న చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ స్వామిని సుప్రేమానంద సరస్వతి

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్ కేంద్రంలో ఆదివారం పోటీలు నిర్వహించారు. యువ పారిశ్రామిక వేత్త టీజీ భరత్, చిన్మయ మిషన్ కేంద్రం అధ్యక్షుడు ఐ.విజయకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ స్వామిని సుప్రేమానంద సరస్వతి పోటీలను ప్రారంభించారు. ఇందులో సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గ్రూప్- ఏలో ఆదోని సాందీపనీ విద్యాలయ యూకేజీ విద్యార్థి జీషన్, గ్రూప్-బీలో ఆదోని నేషనల్ పాఠశాల ఒకటో తరగతి విద్యార్థి కె.విమల్‌కుమార్, గ్రూప్-సిలో ఆదోని సాందీపనీ విద్యాలయ 4వ తరగతి విద్యార్థి అజయ్‌కుమార్, గ్రూప్-డిలో కర్నూలు శ్రీచైతన్య పాఠశాల 6వ తరగతి విద్యార్థి కె.రుత్విక్ రాజ్, గ్రూప్-ఇలో కర్నూలు విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల 9వ తరగతి విద్యార్థి బి.నిత్యశ్రీ హర్షిణి, గ్రూప్-ఎఫ్‌లో ఆదోని చిన్మయ విద్యాలయ విద్యార్థిని సి.హరిణి విజేతలుగా నిలిచారు. చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు ఈ నెల 17వ తేదీన ఒంగోలులోని కొత్తపట్టణం చిన్మయ మిషన్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

తెలుగు సాహిత్యాన్ని విస్తృతం చేస్తాం


సంస్థ ఆవిర్భావ ప్రకటన ప్రతులను ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యాన్ని విస్తృతం చేస్తామని తెలుగు సారస్వత వైభవం సాహితీ సంస్థ అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో సంస్థ ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వాళ్లకు ఉన్న సాహిత్య సంపద చాలా గొప్పదన్నారు. దాన్ని నలుగురికి పంచడం కోసమే సంస్థను ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, రామచంద్రనాయుడు, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు భాసా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ అతిథులుగా హాజరై సంస్థను ప్రారంభించి ప్రసంగించారు. తెలుగు కవులు, రచయితలను ప్రోత్సహించేందుకు సంస్థను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, కవులు, రచయితలు హనుమంతప్ప, ఎలమర్తి రమణయ్య, రామాంజనేయులు, లీలావతి, రంగారెడ్డి, గంగిరెడ్డి, ఇనాయతుల్లా, హరికిషన్, మహమ్మద్ మియ్యా, లక్ష్మయ్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథగట్టులో రేగు చెట్ల అభివృద్ధికి చొరవ


గట్టుపై రేగు పండ్లను వెదజల్లుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత అటవీ అధికారి జయచంద్రారెడ్డి, వర్మి కంపోస్టు ఎరువు తయారీలో రాణిస్తున్న హరికృష్ణ, ఎస్‌బీఐ ఉద్యోగి కృష్ణవేణి తదితరులు రేగు విత్తనాలను ఆదివారం నగర శివారులోని జగన్నాథగట్టు కొండల్లో వెదజల్లారు. ఈ సందర్భంగా విశ్రాంత అటవీ అధికారి మాట్లాడుతూ... జగన్నాథగట్టులో పచ్చదనం అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో కలసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొండల్లో చల్లిన ఎండు రేగుపండ్లు మట్టిలో కలసిపోయి వర్షాకాలంలో మొలకెత్తే అవకాశం ఉందని తెలిపారు. చల్లిన వాటికి కనీసం 100 మొలకలు వచ్చిన మా శ్రమ ఫలించినట్లేనన్నారు.రేగు చెట్లు అభివృద్ధి చెందితే పశుపక్ష్యాదులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం


నన్నూరులో పార్టీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఓర్వకల్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సమాజంలో అన్ని వర్గాలకు సమచిత న్యాయం జరుగుతుందని ఎంపీపీ తిప్పన్న అన్నారు. ఆదివారం మండలంలోని నన్నూరు-3 సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తిప్పన్నతో పాటు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గూర్చి ప్రజలకు వివరిస్తూ.. అభిప్రాయాలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ గఫార్, షరీఫ్‌మియా, ఎంపీటీసీలు ఫాతిమాబి, కుసుమలత తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పెద్ద ఎత్తున చిరుధాన్యాల సాగు చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆత్మ వ్యవసాయ అధికారి మధుమతి ఇన్‌పుట్ డీలర్లను అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మధుమతి చిరుధాన్యాల పంటల సాగు అవశ్యకతపై అవగాహన కల్పించారు. విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త జమచంద్ర పాల్గొన్నారు.

స్పోర్ట్స్

జాతీయ పోటీలకు కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఈనెల 10 నుంచి 12 వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జాతీయ పోటీలకు ఎంపికయిన కర్నూలు క్రీడాకారులు అలెక్స్ మ్యాథ్యూస్, వెన్నలను ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు.

ఆర్‌యూలో ముగిసిన క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్) : రాయలసీమ యూనివర్సిటీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో సెపక్‌తక్రా విభాగంలో ఆదోని ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు, మూడో స్థానంలో ఉస్మానియా కళాశాల జట్టు నిలిచాయి. హ్యాండ్‌బాల్ విభాగంలో ఉస్మానియా డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు, మూడవ స్థానంలో రాయలసీమ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. ఫుట్‌బాల్ విభాగంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు, మూడవ స్థానంలో రాయలసీమ యూనివర్సిటీ జట్టు నిలిచింది. విజేత జట్లకు యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య సీవీ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ, స్పోర్ట్స్ డైరెక్టర్ శివకిషోర్ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, వ్యక్తిగత బహుమతులు అందజేశారు.